www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
సోమవారం | 08 | జూన్ | 2025


## నేడు జిల్లాలో నలుగురు మంత్రుల పర్యటన

**ప్రజాపక్షం/ఖమ్మం :** ఖమ్మంజిల్లాలో సోమవారం నలుగురు మంత్రులు పర్యటించనున్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ లు పర్యటించనున్నారు. మల్లు భట్టివిక్రమార్క హైదరాబాద్ లో ఉదయం 10 గంటలకు బయలుదేరి సూర్యాపేటలో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. మూడు గంటలకు ఖమ్మం చేరుకుని అధికారులు, అనాధికారులను కలుస్తారు. తదనంతరం గౌడ సంఘం భవన నిర్మాణ శం కుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి మిర్యాలగూడ బయలుదేరి వెళ్తారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హైదరాబాద్‌లో బయలుదేరి కూసుమంచి మండలం పోచారం గ్రామంలో జరిగే ఓ కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడి నుంచి ఏదులాపురం కార్పోరేషన్ పరిధిలోని మద్దుపల్లి, తెల్దారుపల్లి గ్రామాల్లో రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు. కస్నాతండా, పోలేపల్లి గ్రామాల్లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. సాయంత్రం నాలుగు గంటలకు రఘునాథపాలెం మండల కార్యాలయ సమీపంలో జరిగే గౌడ సంఘం భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొంటారు. తుమ్మల నాగేశ్వరరావు సైతం గౌడ సంఘం భవన నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# ప్రైవేటుపై నియంత్రణేది..!



**-ఇష్టానుసారంగా ఫీజుల వసూళ్లు**
**-తప్పని డొనేషన్ బాదుడు**
**-బాధ్యత మరిచిన ప్రభుత్వం**
**-కార్పొరేట్ చెప్పు చేతల్లో విద్యాశాఖ**








**ప్రజాపక్షం/ఖమ్మం :** ప్రభుత్వ విద్యా రంగం వెలవెలబోతున్న వేళ ప్రైవేట్‌లో ఫీజుల మోత మోగిపోతుంది. ప్రభుత్వ పాఠశాలలపై పాలకుల నిర్లక్ష్యం, తల్లిదండ్రుల కీనుక నేపథ్యంలో ప్రైవేటు విద్యాలయాలు వసూళ్ల కేంద్రాలుగా మారుతున్నాయి. ఏ తరగతి ఎంత ఫీజు వసూలు చేయాలనే నిబంధన మచ్చుకు కూడా కానరావడం లేదు. స్వయం ప్రకటన పద్దతిలో ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ఫీజులకు తోడు కొన్ని విద్యా సంస్థలు డోనేషన్లు వసూలు చేస్తున్నారు. డోనేషన్‌తో పాటు అడ్మిషన్ ఫీజు చెల్లిస్తేనే పాఠశాలల్లో చేర్చుకుంటున్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు లోబడి మౌలిక వసతులు, బోధన సిబ్బంది లేని అనేక ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న విద్యాశాఖ ఆ వైపు కన్నెత్తి చూడడం లేదు. ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యాశాఖ అచేతన స్థితి ప్రైవేటుకు వరంగా మారింది. ప్రభుత్వ విద్యారంగం కూనరిల్లుతున్న సమయంలో ప్రైవేటు విద్యా సంస్థల జోరు పెరిగింది. అన్ని వసతులు ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో

మిగతా 2లో..

## నిష్కలంక ప్రజా నాయకుడు మదన్‌లాల్





**-గిరిజనభ్యున్నతి కోసం పరితపించిన నేత**
**-మదన్‌లాల్‌కు ఘన నివాళి**

**ప్రజాపక్షం/ఖమ్మం :** సుదీర్ఘ కాలం రాజకీయాల్లో కొనసాగిన బానోత్ మదన్‌లాల్ నిష్కలంక ప్రజా నాయకుడని వైరా నియోజక వర్గ అభివృద్ధికి తుది శ్వాస వరకు కృషి చేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఇటీవల మరణించిన బానోత్ మదన్ లాల్ సంస్మరణ కార్యక్రమం ఆదివారం రఘునాథపాలెం మండల పరిధిలోని ఈర్లపుడిలో జరిగింది. ఈ సందర్భంగా పలువురు మదన్‌లాల్ సేవలను కొనియాడారు. విప్లవ రాజకీయాలతో ప్రారంభమైన మదన్‌లాల్ రాజకీయ జీవితం ఎన్ని మలుపులు తిరిగినా తాను నమ్మిన ప్రజల కోసమే పని చేశారన్నారు. సర్పంచ్‌గా,

మిగతా 2లో..

## పురిటి నొప్పుల తిప్పలు..!



**-రహదారి లేక గ్రామానికి చేరుకోని అంబులెన్స్**
**-మంచంపై మోసుకెళ్లిన గ్రామస్తులు**



**ప్రజాపక్షం/పినపాకః** మారుమూల ఏజెన్సీ గ్రామాల వాసులకు తిప్పలు తప్పడం లేదు. స్వాతంత్రం వచ్చి ఇన్ని సంవత్సరాలు అవుతున్నా రవాణా సౌకర్యం లేక ఆదివాసీలు అవస్థ పడుతూనే ఉన్నారు. ముఖ్యంగా గర్భిణులు తీవ్ర కష్టాలు ఎదుర్కోవడం పరిపాటిగా మారింది. ఆదివాసీ మహిళలు, ముఖ్యంగా గర్భిణులు, రహదారి సౌకర్యం లేకపోవటం వల్ల పురిటి నొప్పుల సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

మిగతా 2లో..

# ప్రైవేటుపై నియంత్రణేది..!

(మొదటిపేజీ తరువాయి)

10 నుంచి 15 మంది విద్యార్థులుంటే పక్కనే అర్హత గల బోధనా సిబ్బంది, మౌలిక వసతులు లేని ప్రైవేటు విద్యాలయాల్లో వందల మంది విద్యార్థులుండటం గమనార్హం. ప్రైవేటుపై మోజు ప్రభుత్వ విద్యాలయాలపై అప నమ్మకం విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఏర్పడడంతో ప్రైవేటు విద్యా సంస్థల యజమానులు మా దగ్గర రాక తప్పదు కదా అనే రీతిలో ఫీజుల దోపిడీకి తెర లేపారు. తాము చెప్పిందే ఫీజు అడిగిందే డోనేషన్ అనే రీతిలో వ్యవహరిస్తుండడంతో విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రైవేటు ఫీజు భారంగా మారింది. ఆస్తులు అమ్ముకుంటే తప్ప ప్రైవేటు విద్యాలయాల్లో విద్యార్థులను చదివించలేని పరిస్థితి. పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తల్లిదండ్రులు ప్రైవేటు విద్యాలయాల్లో చదివించేదుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రైవేటు పాఠశాలల ఏర్పాటు, నిర్వహణ వెనుక మానవీయ కోణం దాగి ఉండేది. విద్యా సంస్థలు నెలకొల్పేటప్పుడే ఎక్కువ మందిని ఉన్నత విద్యావంతులుగా తయారు చేయాలనే లక్ష్యంతో పాటు పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన మెరిట్ విద్యార్థులకు ఉచితంగా విద్యను బోధించాలనే ఆలోచన ఉండేది. లాభాల కంటే ఇబ్బందులు లేకుండా పాఠశాలల నిర్వహణే వారి ఆలోచనగా ఉండేది. ఇప్పుడు విద్యా సంస్థలు నెలకొల్పుతున్న వారిలో అత్యధిక శాతం మందికి ధనార్జనే ధ్యేయంగా మారింది. కార్పొరేట్ సంస్థల సంగతి చెప్పాల్సిన అవసరమే లేదు. తన, మన, పర, పేద, సాద అనే బేధం లేకుండా వసూళ్లకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్న ప్రైవేటు పాఠశాలలకే మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు ఎందుకు ఎగబాడుతున్నారు. స్థాయిలేకపోయినా చదివించాల్సిన తాపత్రయం ఎందుకున్న ప్రశ్న వినపడుతుంది. ప్రభుత్వ పాఠశాలల్లో సిబ్బంది లేకపోవడం ప్రత్యేకించి విద్యార్థుల సంఖ్య కనిష్ట స్థాయిలో ఉండడంతో అక్కడ చదివితే తమ పిల్లలకు భవిష్యత్తు ఉండదన్న భావన పెరిగిపోయింది. రెండవది ప్రైవేటు మోజు. ప్రభుత్వ పాఠశాల్లో పిల్లలను చదివించే వారిని హీనంగా చూస్తున్న పరిస్థితి కూడా అప్పో సప్పో చేసి ప్రైవేటు పాఠశాలల్లో చదివించే పరిస్థితికి తీసుకువస్తుంది. ప్రజల ఆలోచనకు అనుగుణంగా ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలపై అజమాయిషీతో పాటు ఫీజులను నియంత్రించాల్సి ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఫీజులకు సంబంధించి ఒక జీవోను విడుదల చేసి దానిని సక్రమంగా అమలు చేయాల్సి ఉంది. ప్రభుత్వ యేటా కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా ఎందుకు ప్రభుత్వ పాఠశాలలు విశ్వసనీయతను కోల్పోతున్నాయో ఆలోచన చేయడం లేదు. పరోక్షంగా ప్రభుత్వ తీరు ప్రైవేటును ప్రోత్సహించినట్లవుతుంది. ప్రైవేటు పాఠశాలలు ఎక్కడ ప్రభుత్వ నిబంధనలను పాటించడం లేదు. ఒక విద్యా సంస్థ ఏర్పాటుకు కావాల్సిన నియమ నిబంధనలను గాలికి వదిలేస్తున్నాయి. అర్హత లేని బోధన సిబ్బందిని అరకొర వేతనాలతో నియమించుకుని ఫీజుల దోపిడీకి పాల్పడుతున్నాయి. బోధనా సిబ్బందికి అర్హత లేకపోయినా పాఠశాలలకు ఉండాల్సినటువంటి వసతులు లేకపోయినా ఫీజుల వసూళ్లలో రాజీ లేదన్న రీతిలో యజమాన్యాలు వ్యవహరిస్తున్నాయి. ఇక ఫీజుల సంగతి ఇలా ఉంటే యూనిఫాం, పుస్తకాలు, ఇతరత్రా వాటిపై యజమాన్యాలు లాభసాటి వ్యాపారం నిర్వహిస్తున్నాయి. తమ వద్దనే కొనాలి. తాము చెప్పిన ధరకే కొనాలి అంటూ షరతు విధిస్తున్నారు. పిల్లలు వాడే బూట్లు, టై, బ్యాడ్జీలు కూడా రెండింతల అధిక ధరకు విక్రయిస్తున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. అడ్డదారిలో విద్యా వ్యాపారం అడ్డగోలుగా సాగుతున్న విద్యాశాఖ ప్రైవేటు పాఠశాలల వైపు కన్నెత్తి చూడటం లేదు. పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య ఎంత, అర్హత కలిగిన బోధన సిబ్బంది ఎంత, పాఠశాలలకు ఆట స్థలముందా, నీటి వసతి ఉందా, బహుళ అంతస్తుల భవనాల్లో రక్షణ వ్యవస్థ ఉందా అని పరిశీలన చేయాల్సిన విద్యాశాఖాధికారులకు ఆలోచనే లేదు. ఎద్దు ఈనిందంటే గాటికి కట్టేయ్యమన్నట్లు కార్యాలయాల్లో కూర్చుని అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారు. పాఠశాల ఒక చోట ఆట స్థలం మరో చోట. అయిన అభ్యంతరం తెలపడం లేదు. పరోక్షంగా ప్రభుత్వ విద్యను నీరుగార్చి ప్రైవేటును ప్రోత్సహిస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తీసుకు వచ్చి తూచ తప్పకుండా అమలు చేయాల్సి ఉంది. అదే సమయంలో ప్రభుత్వ రంగ విద్యా సంస్థలను మరింత బలోపేతం చేయాల్సి ఉంది. లేకుంటే విద్యా దోపిడీ మరింత పెరిగే అవకాశం ఉంది.

# పురిటి నొప్పుల తిప్పలు..!

(మొదటిపేజీ తరువాయి)

గ్రామానికి అంబులెన్స్ వెళ్లడానికి వీల్లేక, రోడ్డు మార్గం లేకపోవటం వల్ల వారు ఆసుపత్రికి చేరడానికి చాలా కష్టపడవలసి వస్తుంది, దీనివల్ల గర్భిణీలు వారి శిశువుల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం టీ కొత్తగూడెం గ్రామపంచాయతీ ఉమేష్ చంద్ర నగర్ గ్రామంలో ఇలాంటి హృదయ విధారక ఘటన ఆదివారం చోటు చేసుకుంది మొడియం జానకి అనే గిరిజన మహిళకు పురిటి రావడంతో రహదారి సౌకర్యం లేక మంచానికి కట్టి మోసుకుపోయే పరిస్థితి ఏర్పడింది. కనీసం రహదారి సౌకర్యం లేక ఆ పురిటి నొప్పులతోనే మహిళా పడ్డ వేదన వర్ణనాతీతం. రహదారి లేకపోవటం వల్ల అంబులెన్స్ ఆ ప్రాంతాలకు చేరుకోలేవు, దీనివల్ల గర్భిణీలు ఆసుపత్రికి వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నారు. రహదారి లేకపోవడంతో అక్కడే 108 వాహనం రాలేక ఆగిపోయింది. దీంతో గ్రామస్తులు మంచానికి కర్రలు కట్టి గర్భిణిని అందులో పడుకోబెట్టి మోసుకెళ్లారు. అక్కడి నుంచి ఆమెను అంబులెన్స్‌లో జానంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. రోడ్డు మరమ్మత్తు పనులు వెంటనే చేపట్టి త్వరలో శాశ్వత రోడ్డు నిర్మాణానికి కృషి చేయాలని రవాణా సౌకర్యం కల్పించాలని గ్రామ వాసులు కోరుతున్నారు.

# నిష్కలంక ప్రజా నాయకుడు మదన్‌లాల్

(మొదటిపేజీ తరువాయి)

శాసన సభ్యునిగా ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమన్నారు. జిల్లా నలు మూలల నుండి ఆయన అభిమానులు ఈర్లపుడి చేరుకుని నివాళులర్పించారు. వివిధ రంగాల ప్రముఖులు మదన్‌లాల్‌కు నివాళులర్పించి ఆయనతో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు. రాజకీయాలకు అతీతంగా స్నేహాన్ని కొనసాగించిన మదన్‌లాల్ గిరిజన అభ్యున్నతి కోసం కృషి చేశారన్నారు. ఆయన మరణం ఖమ్మంజిల్లా రాజకీయాలకు తీరని లోటని ఆయన స్థానాన్ని ఎవరు భర్తీ చేయలేరన్నారు. ఓడినా, గెలిచినా ప్రజల మధ్య నిలిచిన నేతగా మదన్‌లాల్‌కు మంచి పేరుందన్నారు. శాసనసభలో ప్రజా సమస్యలపై సానుకూల చర్చ చేసే మదన్‌లాల్ మరణం బడుగు, బలహీన వర్గాలకు తీరని లోటన్నారు. మదన్‌లాల్ కుమారుడు ఐఎఎస్ అధికారి మృగేందర్‌లాల్, ఆయన సతీమణి మంజుల వారి కుటుంబ సభ్యులను పలువురు ఓదార్చారు. కొత్తగూడెం శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, బిఆర్ఎస్ నాయకులు కొండబాల కోటేశ్వరరావు, ఆర్‌జెసి కృష్ణ, ఇల్లందు శాసన సభ్యులు కోరం కనకయ్య, ప్రముఖ వైద్యులు మదన్‌సింగ్, దేవేందర్, రాములు నాయక్, వీరునాయక్, కేశవ్‌నాయక్, శేషరాం, టిఎన్‌జిఓ జేఏసి సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు, ఉద్యోగ సంఘాల నాయకులు గుంటుపల్లి శ్రీనివాసరావు, కాంగ్రెస్ నాయకులు రాధాకిషోర్, డిసిసిబి మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం తదితరులు మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# సిపిఐ మండల మహాసభను జయప్రదం చేయండి

ప్రజాపక్షం/బోనకల్ : ముష్టికుంట్ల గ్రామంలో ఈనెల 11న జరిగే మండల మహాసభను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు కోరారు. ఆదివారం జరిగిన మీడియా సమావేశంలో రామాంజనేయులు మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ 17వ మహాసభ ముష్టికుంట్లలో జక్కా నాగభూషణం ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. కమ్యూనిస్టు పార్టీ అనేక ఉద్యమాలకు నేతృత్వం వహించిందని నాటి సాయుధ తెలంగాణ పోరాటం నుంచి నేటి వరకు ప్రజా సమస్యల పరిష్కారం కోసం జరిగిన పోరాటాల్లో సిపిఐ ముందు భాగాన నిలిచిందన్నారు.దేశం ఒక సంక్లిష్ట స్థితిని ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో కమ్యూనిస్టుల అవసరం మరింత పెరిగిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో గత కార్యక్రమాలను సమీక్షించుకుని భవిష్యత్తు కార్యాచరణను రూపొందించుకునేందుకు ఈ మహాసభలు నిర్వహిస్తున్నామన్నారు. మీడియా సమావేశంలో



సిపిఐ మండల కార్యదర్శి వెంగళ ఆనందరావు, సహాయ కార్యదర్శి ఆకెన పవన్, నాయకులు మాతంగి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# వెంకట్రామిరెడ్డికి అగ్రిఎక్సలెన్స్ అవార్డు

ప్రజాపక్షం/ఖమ్మం : ప్రకృతి వ్యవసాయం సాగు చేసే రైతు, సత్యసాయి సేవా సంస్థల కో ఆర్డినేటర్ కుదుముల వెంకట్రామిరెడ్డికి నవ నిర్మాణ ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ఏరువాక అగ్రిఎక్సలెన్స్ అవార్డుతో సత్కరించింది. హైదరాబాద్‌లో ఆదివారం అవార్డుతో పాటు ప్రశంసా పత్రం, షీల్డ్, నగదు ఇచ్చి శాలువతో సత్కరించారు. సుందర్ ఎడ్యుకేషన్ అకాడమిలో ప్రముఖ సినీ నటుడు బాబుమోహన్, నటి కవిత, నవ నిర్మాణ ఫౌండేషన్ చైర్మన్ పొన్నాల రాంబాబు, విద్యా సంస్థల అధినేత సుందర్‌రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజలు సంతోషంగా, ఆరోగ్యంగా ఉండాలంటే విష రసాయనాలు లేని సేంద్రియ ఆహారం



తీసుకున్నప్పుడే సాధ్యమవుతుందన్నారు. కల్తీ ఆహారపు ఉత్పత్తులు ప్రజల ఆరోగ్యానికి చేటు చేస్తాయన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యమన్న సూత్రానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలన్నారు. ఎర్రుపాలెం మండల పరిధిలోని మీనవోలు గ్రామానికి చెందిన కుదుముల వెంకట్రామిరెడ్డి రెండు దశాబ్దాలుగా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయాన్ని సాగు చేయడమే కాకుండా పలువురు రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కల్పిస్తున్నారు. ఇప్పటికే పలు సభలు, సమావేశాల్లో పాల్గొన్న వెంకట్రామిరెడ్డి సేంద్రియ సాగు రైతుగా, సలహాదారునిగా వినతికెక్కారు.

# రైతు వేదికకు వాటర్ ఫిల్టర్ వితరణ

ప్రజాపక్షం/ బోనకల్ : మండల పరిధిలోని చిన్న బీరవల్లి గ్రామ రైతు వేదికకు బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన మండదపు సత్యనారాయణ, సామ్రాజ్యం జ్ఞాపకార్థం వారి కుమారులు మండదపు వెంకటేశ్వరరావు, మండదపు వీరభద్రం రైతు వేదికకు ఆదివారం వాటర్ ఫిల్టర్‌ను అందజేశారు. రైతు వేదికల వద్దకు సమావేశాలకు వచ్చే అధికారులు, రైతులకు ఈ ప్యూరీఫైడ్ వాటర్ ఫిల్టర్ ద్వారా త్రాగునీటిని అందించే అవకాశం ఏర్పడిందన్నారు. మండదపు వెంకటేశ్వరరావు, వీరభద్రాన్ని పలువురు రైతులు అభినందించారు.



# బిజెపి గిరిజన మోర్చా అధ్యక్షునిగా రాజేష్

ప్రజాపక్షం/కామేపల్లి: కామేపల్లి మండలం గోవింద్రాల గ్రామానికి చెందిన బాదావత్ రాజేష్ బిజెపి గిరిజన మోర్చా మండల అధ్యక్షులుగా నియమితులయ్యారు. ఆదివారం మండల పార్టీ అధ్యక్షులు జర్పల రామారావు నియామకపు పత్రాన్ని మండల కేంద్రమైన కామేపల్లిలో రాజేష్‌కు అందజేశారు. గిరిజన మోర్చా మండల అధ్యక్షులుగా నియమితులైన రాజేష్‌ను గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు భూక్య శ్రీను నాయక్, పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోలూరి రామచంద్రయ్య, మండల ప్రధాన కార్యదర్శి జర్పల కృష్ణ, ధరావత్ బాలకృష్ణ, వీరబోయిన మందార్ అభినందించారు. గిరిజన మోర్చా మండల అధ్యక్షులుగా తనను నియమించినందుకు రాజేష్ మండల పార్టీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గిరిజన మోర్చా అభివృద్ధికి, గిరిజనుల సమస్యల పరిష్కారానికి పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఈ సందర్భంగా రాజేష్ స్పష్టం చేశారు.



# ఫోక్సో కేసులో నిందితుడి అరెస్ట్

ప్రజాపక్షం/ఖమ్మం క్రైం: చింతకాని మండల పరిధిలోని ఒక గ్రామంలో మైనర్ బాలికను ఖమ్మం అర్బన్ మండలం కొత్తగూడెం ప్రాంతానికి చెందిన నిందితుడు షేక్ ఇర్ఫాన్ వేధింపులకు పాల్పడ్డాడు. బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు సదరు నిందితుడిని శనివారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వైరా సిఐ సాగర్ తెలిపారు.

# కొత్తపాలెంలో గంగనమ్మ జాతర



ప్రజాపక్షం/ఎర్రుపాలెం : మండల పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో ఆదివారం గంగనమ్మ జాతరను అత్యంత భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు జానకి రామయ్య ఆధ్వర్యంలో అమ్మవారికి జలాభిషేకాన్ని నిర్వహించారు. కార్తీకదర్శ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 11 గంటల పాటు మహిళలు మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బోనాల జాతరలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు యాకయ్య, భాస్కర్‌రావు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్పొరేటీకరణ మోడీ ప్రభుత్వ లక్ష్యం

## పౌర హక్కుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.రవి



**ప్రజాపక్షం/పెనుబల్లి:** వ్యవసాయ కార్పొరేటీకరణ కోసమే రైతు వ్యతిరేక నల్ల చట్టాలను దొడ్డి దారిన అమలు చేయుటకు మోడీ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని పౌర హక్కుల సంఘం (సీఎల్.సీ) రాష్ట్ర ఉపాధ్యక్షులు కూకలకుంట రవి అన్నారు. హిందుత్వ రాజ్య స్థాపన లక్ష్యంగా మోడీ ప్రభుత్వం అడుగులేస్తోందని, దేశభక్తి ముసుగులో దేశ దురభిమానాన్ని ప్రజల మెదడల్లో నూరిపోస్తుందన్నారు. ఆదివారం పెనుబల్లిలో అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏ.ఐ.యు.కె.ఎస్) కల్లూరు డివిజన్ ప్రథమ మహాసభ ఒగ్గు నాగిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ దేశ ప్రయోజనాలు కంటే కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసమే మోడీ ప్రభుత్వం ప్రాధాన్యతిస్తుందన్నారు. ఢిల్లీ తరహా రైతు ఉద్యమాలు నిర్వహించినప్పుడే మోడీ ఫాసిస్టు విధానాలను రైతాంగం తిప్పి కొట్టగలదన్నారు. బిజేపీ, ఆర్ఎస్ఎస్ ఫాసిస్టు ప్రభుత్వం రాజ్యాంగ హక్కులను కాలరాస్తూ మద్యయుగాలనాటి మను ధర్మ శాస్త్రాలనే అమలు చేసే ప్రయత్నం చేస్తుందన్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మలీదు నాగేశ్వరావు మాట్లాడుతూ రైతు పండించిన అన్ని రకాల పంటలకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు ప్రకారం కనీసం ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కొల్లేటి నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవడంలో విఫ్లమయ్యాయన్నారు. రైతు రుణ మాఫీ, రైతు భరోసా, బోనస్ కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రం వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎం.ఎల్) ప్రజా పంథా డివిజన్ కార్యదర్శి ఎ . వెంకట రెడ్డి, జిల్లా నాయకులు గంటా శ్రీను,బీరెల్లి లాజర్ ,ట్రేడ్ యూనియన్ (టీ.యూ.సీ.ఐ) జిల్లా నాయకులు అమర్లపూడి శరత్, మాస్ లైన్ పార్టీ పెనుబల్లి,కల్లూరు మండల కార్యదర్శి కె.పుల్లారావు, సత్తుపల్లి మండల కార్యదర్శి తాటి రాజు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు కాటినేని శ్రీనివాసరావు, ఎన్.వీ.రమణ తదితరులు పాల్గొన్నారు.

# 27న పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక డీలక్స్ బస్సులు

## డిపో మేనేజర్ యు. రాజ్యలక్ష్మి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** ఈ నెల 27 న సత్తుపల్లి నుండి 5 పుణ్యక్షేత్రాలకు భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక డీలక్స్ బస్సును నడుపుతున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యు రాజ్యలక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 27 శుక్రవారం తెల్లవారుజామున 4 గంటలకు సత్తుపల్లి నుండి డీలక్స్ బస్సు బయలుదేరుతుందని, ఐదు పుణ్యక్షేత్రాలను దర్శింపచేసి, అదే రోజు రాత్రి 10 గంటలకు తిరిగి సత్తుపల్లి చేరుకుంటుందన్నారు. సత్తుపల్లి నుండి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మద్ది ఆంజనేయస్వామి ఆలయం, ద్రాక్షారామంలో వెలసిన భీమేశ్వర స్వామి ఆలయం, అదే విధంగా కోనసీమ తిరుపతిగా పేరొందిన వాడపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంతో పాటు పెనుగొండలోని కన్యకాపరమేశ్వర మాత ఆలయం, చిన్న తిరుపతిగా పేరొందిన దివ్య పుణ్యక్షేత్రం ద్వారక తిరుమల పుణ్యక్షేత్రాలను దర్శింప చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ ఐదు పుణ్యక్షేత్రాలు దర్శించుకునేందుకు డీలక్స్ బస్సు చార్జీ పెద్దలకు 1000 రూపాయలుగా, పిల్లలకు 700 రూపాయలుగా నిర్ణయించినట్లు ఆమె వివరించారు. దేవాలయాలలోని దర్శన టికెట్లు తదితర ఖర్చులు భక్తులే భరించాలని ఆమె తెలిపారు. మరిన్ని వివరాలకు 9866619189, 9542698518 ఫోన్ నెంబర్లను సంప్రదించాలన్నారు.డిపో పరిధిలోని భక్తులందరూ ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి కోరారు.

# ఘనంగా గంగమ్మ దేవాలయం పునః ప్రతిష్ఠామహోత్సవం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలం లోని గువ్వలగూడెం గ్రామంలో గంగమ్మ దేవాలయం పున ప్రతిష్టా మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ నెల 5వ తేది నుంచి 8 వరకు జాతర ను ఘనంగా చేపట్టారు. ఆదివారం ముగింపు సందర్భంగా అత్యంత వైభవంగా నిర్వహించారు. మహిళలు బోనమెత్తారు. గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పున ప్రతిష్ట మహోత్సవం లో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సతీమణి మాధురి పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కోరట్ల గూడెం, పైనంపల్లి లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం శంఖుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ వెన్న పూసల సీతారాములు, నాయకులు శాఖమూరి రమేష్, జెర్రిపోతుల అంజని, బచ్చలకూరి నాగరాజు, మామిడి వెంకన్న, చెరువు స్వర్ణ, కొమ్మినేని విజయబాబు, అడపాల రామారావు, మార్తి కోటి, కడియాల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసుకోవాలి



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తి చేసుకోవాలని నేలకొండపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ వెన్నపూసల సీతారాములు సూచించారు. మండలం లోని కోనాయి గూడెం లో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలకు ఆదివారం శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాతనే పేదోడి సొంతింటి కల నెరవేరుతుందని అన్నారు. మంత్రి శ్రీనివాసరెడ్డి చోరవ తో అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇళ్ల ను మంజూరు చేస్తారని తెలిపారు. పదేళ్లలో ఒక్క ఇల్లు కూడ ఇవ్వలేని బీఆర్ఎస్ నాయకులకు మాట్లాడే అర్హత లేదని అన్నారు. రాష్టం ను అప్పుల పాలు చేసి వెళ్లితే, ఏడాదిలోనే ప్రగతి చేసి చూపించామని పేర్కోన్నారు. ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం నిరంతరం జరిగే ప్రక్రియ అన్నారు. అర్హత ఉన్న ప్రతి పేదోడికి ఇంటి ని మంజూరు చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొడ్డ బొందయ్య, మేకల వేంకటేశ్వర్లు, కొమ్మినేని విజయ్ బాబు, వడ్లమూడి నర్సయ్య,కన్నరెడ్డి, సైదులుపాల్గొన్నారు.

# అడవులను కాపాడుకుందాం





**ప్రజాపక్షం/చంద్రుగొండ:** అడవులను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్పీ రోహిత్ రాజు అన్నారు. ఆదివారం బెండాలపాడు శివారు కనిగిరి గుట్టలను ఆయన సందర్శించారు. అదే విధంగా ఎదురు వస్తువులు ఉత్పత్తి తయారీ కేంద్రాన్ని సందర్శించి, తయారీ విధానాన్ని గురించి అడిగి తెలుసుకున్నారు. అడవిలో ప్లాంటేషన్లు సందర్శించి, అటవీ సిబ్బందిని అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కాలుష్యం వల్ల అన్ని రకాలుగా పర్యావరణం దెబ్బతింటుందని, అడవులను సంరక్షించుకోవడం మన అందరి బాధ్యత అని గుర్తు చేశారు. అడవులు నరికితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట డిఎస్పి అబ్దుల్ రెహమాన్, రేంజర్ ఎల్లయ్య, సీఐ సమరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

# 19 నెలల పాలనలో అమలుగాని ఆరు గ్యారంటీలు

## మంత్రివర్గ విస్తరణతో కాంగ్రెస్‌లో పెరిగిన అసంతృప్తి : భీమిరెడ్డి పుల్లారెడ్డి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** 19 నెలల కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారెంటీలు పేసలకు అందని ద్రాక్షలు గానే ఉన్నాయని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ భీమిరెడ్డి పుల్లారెడ్డి విమర్శించారు. ఆదివారం వేంసూరులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సుదీర్ఘకాలం వేచి చూసి మంత్రివర్గ విస్తరణ చేసిన కాంగ్రెస్ కు అసంతృప్తులు పెరిగాయన్నారు. సాక్షాత్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వాగ్దాన భంగం ప్రజలకు తేటతెల్లమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తులో మరోసారి అధికారంలోకి రావడం కష్టమని, ఇప్పటికైనా ఎన్నికల హామీలను అమలు చేయడం ద్వారా ప్రజల మన్ననలు పొందాలన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తానని కొత్త నినాదం ఎత్తుకున్నారన్నారు. ఇది ఎలా సాధ్యమవుతుందో వివరించలేకపోతున్నారన్నారు. రైతు భరోసా రూ.15,000 ఇస్తానని వాగ్దానం చేసి ఇంతవరకు ఒకసారి కూడా ఇవ్వలేకపోయారన్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో అమలు కాలేదన్నారు. గోదావరి జలాలను బనకచర్ల పేరుతో ఆంధ్ర జలదోపిడికి పాల్పడబోతోందని విమర్శించారు. దీనిని అడ్డుకునేందుకు ముఖ్యమంత్రి కేంద్ర జల సంఘానికి లేక కూడా రాయలేకపోయారన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు తక్షణమే రిపేర్లు చేపట్టాలని, గత వేసవిలో పంటలు కోల్పోయిన తెలంగాణ రైతులకు నష్టపరిహారం అందలేదని, తక్షణమే నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కాళేశ్వరం పంప్ హౌజ్ లో మోటార్లకు రిపేర్ చేయడం ద్వారా రైతులకు సకాలంలో నీరు అంది పంటలకు నష్టం కలగదన్నారు. కొన్ని పథకాలు అమలవుతున్న వాటిని ప్రజల్లోకి మంత్రులు అన్నుకన్న రీతిలో తీసుకెళ్ళటం లేదని, తద్వారా పార్టీకి భారీ నష్టం జరుగుతుందన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఆత్మపరిశీలన చేసుకుని ప్రజలకు, రైతులకిచ్చిన వాగ్దానాలు అమలు చేయాలని హితవు పలికారు.

# కార్మికుడి కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు అందజేత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాకలోని ఐటిసి పిఎస్పీడీలో పని చేస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సొక్క నాగేశ్వరరావు కుటుంబానికి రే 5లక్షల చెక్కును అందజేశారు. గత నెల 9వ తేదీన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన నాగేశ్వరరావు కుటుంబ సభ్యులను హైదరాబాద్‌లో వారి ఇంటి ఇద్దకు వెళ్లి కలిసి పినపాక నియోజకవర్గ కోఆర్డినేటర్, తెలంగాణ రాష్ట్ర టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు, ఐటిసి టిఎన్‌టియుసి అధ్యక్షులు కనకమేడల హరిప్రసాద్, టిఎన్‌టియుసి రాష్ట్ర ప్రచార కార్యదర్శి గల్లా నాగభూషయ్యలు పరామర్శించారు. తెలుగు దేశం పార్టీ సభ్యత్వం ద్వారా వారి కుటుంబ సభ్యులకు లభించే ఐదు లక్షల రూపాయల చెక్కును ఈ సందర్భంగా అందజేశారు. కుటుంబానికి అండదండలుగా తమ యూనియన్ ఉంటుందని వారు పేర్కొన్నారు.

## మూడు కిలోమీటర్లు..ముప్పు తిప్పలు..!



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు మండల పరిధిలోని పెద్ద కోరు కొండి నుంచి వెన్నవల్లి గుట్ట వరకు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు హైవే వాహనాలతో గత రెండు సంవత్సరాల నుంచి ధ్వంసమై రాకపోకలకు ఇబ్బందిగా ఉండటంతో వాహనదారులు ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవే రహదారి నిర్మాణానికి గాను గ్రీన్ ఫీల్డ్ హైవే కంపెనీ వారు రెండు సంవత్సరాల నుంచి భారీ వాహనాలతో గుట్ట నుంచి మట్టితోలకాలను చేస్తున్నారు. తరచూ భారీ వాహనాలు రద్దీతో రోడ్డు ధ్వంసమై గుంటలు గుంటలుగా ఏర్పడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతుంది. దీంతోపాటు గుంతలు గుంతలుగా ఏర్పడిన వద్ద మట్టి పోసి మరమ్మత్తులు తాత్కాలికంగా పనులు చేశారు. అయినా అవి వారం రోజులు కూడా ఉండకపోవడంతో మళ్లీ అవే గుంటలు దర్శనమిస్తున్నాయి. దీనివలన పెద్ద కోరుకొండి నుంచి వయా వెన్న వల్లి మీదుగా ఎర్రమాడు ఆంధ్ర సరిహద్దు దగ్గరగా ఉండటంతో ఆంధ్ర టు తెలంగాణ ప్రజలు రాకపోకలు నిరంతరం రాత్రి పగలు ప్రయాణాలు కొనసాగిస్తుంటారు. ఈ సమయంలో వాహనదారులు ప్రయాణికులు ఒళ్ళు హూనంతో, శరీరం గుల్ల నొప్పులతో మూలనబడుతున్నారు. బిటి రోడ్డు మట్టి రోడ్డుగా తయారయింది. కుంగిన గుంతలు పడిన రోడ్డు మరమ్మత్తులు చేయాలని ప్రజల కోరుతున్నారు. ఈ ఈ విషయమై ఆర్ అండ్ బి జె ఈ రవిచంద్రను వివరణ కోరగా ప్రతిపాదనలు పంపించామని మంజూరి కాగానే రోడ్డు మరమ్మతులు చేపడతామని ఆయన తెలిపారు.

## జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా చందర్‌రావు



**ప్రజాపక్షం/కల్లూరు:** జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షునిగా పసుమర్తి చందర్‌రావు తో ఆదివారం డిఎన్‌పి ఫంక్షన్ హాల్ లో రాష్ట్ర అధ్యక్షులు అమరవాది లక్ష్మి నారాయణ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, రాష్ట్ర మహిళా నాయకులు ఉప్పల శారద, ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్ పర్సన్ కాల్వ సుజాత లు కార్యవర్గాన్ని ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఆర్య వైశ్యులు ఆర్థికంగా, రాజకీయపరంగా, సామాజికపరంగా అభివృద్ధి పొందాలని, సమాజంలో జరుగుతున్న సమస్యల పట్ల స్పందిస్తూ ఆర్యవైశ్య సమాజానికి అండగా ఉండాలని, పేద ఆర్యవైశ్యులుకృషి చేయాలని కోరారు. అనంతరం పసుమర్తి చందర్‌రావు మాట్లాడుతూ జిల్లాలో జిల్లా ఆర్యవైశ్య సంఘానికి ప్రత్యేక భవనం ఖమ్మంలో నిర్మించేందుకు కృషి చేస్తానని, ఆర్యవైశ్యులు అండగా ఉంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని 21 మండలాల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు.

**నూతన కమిటీ ఏకగ్రీవ ఎన్నిక..**

వనమా కిరణ్, గోళ్ళ రాధాకృష్ణ కోశాధికారిగా, పసుమర్తి వెంకటేశ్వరరావు ప్రచార కార్యదర్శిగా, కే బలరాం వర్కింగ్ ప్రెసిడెంట్ గా, జి జగదీష్ కుమార్, నాగ బండి శ్రీనివాస్, మహిళా విభాగం దోసపాటి సంధ్యారాణి, సత్తుపల్లి నియోజకవర్గ ఇన్చార్జి పసుమర్తి రాంబాబు ఎన్నికైనట్లు వారు తెలిపారు.

## ముత్యాలమ్మ గంగమ్మకు మొక్కులు చెల్లించుకున్న గొల్లగూడెం గ్రామస్తులు



**ప్రజాపక్షం/సుజాతనగర్:** సుజాతనగర్ మండలంలోని గొల్లగూడెం గ్రామంలో ఎంతో అంగరంగ వైభవంగా ముత్యాలమ్మకు గంగమ్మకు పూజలు చేసి ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. గొల్లగూడెం గ్రామస్తులంతా ప్రతి సంవత్సరం తొలకరి చినుకులు పడే వేళ వర్షాలు సమృద్ధిగా రావాలని, పాడిపంటలు బాగా ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. డప్పు చప్పులతో సందడి చేస్తూ ప్రతి ఇంటి ముందు పూజలు చేస్తూ అమ్మవారిని దర్శించుకుంటారు. గ్రామస్తులంతా కలిసి చేసుకోవడంతో ఆ గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. ముత్యాలమ్మ గంగమ్మ తల్లి తమ గ్రామానికి చల్లగా చూస్తారని గ్రామస్తులు నమ్ముతున్నారు.

# పంటల బీమా రైతులకు అందేనా..!

**-ఇందిరమ్మ ప్రభుత్వంపై ఆశలు**
**-ప్రకృతి వైపరీత్యాలకు దెబ్బతింటున్న పంటలు**
**-నష్టపోతున్న రైతులు**
**-నిలిపేసిన ఫసల్ బీమా పథకం**
**-పథకం అమలులో లేక అందని పరిహారం**





**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** ప్రకృతి వైపరీత్యాలతో పంటలకు నష్టం జరిగితే ఆదుకునే పంట బీమా పథకం అమలు కావడం లేదు. కేంద్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలిపివేసింది. ఆరేళ్లుగా ఈ పథకం ఆగిపోయింది. జిల్లాలో గత రెండేళ్ల నుంచి అధిక వర్షాలకు పం టలు దెబ్బతిన్నాయి. పథకం అమలులో లేకపోవడంతో రైతులకు పరిహారం అందడం లేదు. దీంతో ఆర్థికం గా తీవ్రంగా నష్టపోతున్నారు.

**ఫసల్ బీమా యోజన ద్వారా...**


విపత్కర పరిస్థితుల్లో రైతుల పంటలు నష్టపోతే వారికి బీమా కల్పించి పరిహారం అందించేలా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం ప్రవేశపెట్టింది. ఈ పథకాన్ని రాష్ట్రంలో గతంలో అమలు చేసి నిలిపివేశారు. గతంలో అన్నదాతలు పంట నష్టపోతే పంటల బీమా ద్వారా కొంతమేరకు లబ్దిపొందారు.

**ఇందిరమ్మ ప్రభుత్వంపై ఆశలు...**

గత బీఆర్‌ఎస్ ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం నుంచి వైదొలగడంతో కొత్త పంటల భీమా పథకాన్ని అమలు చేయలేదు. గత ఆరేళ్లుగా పంటల బీమా పథకం అమలు చేయలేక వర్షాలకు పంటలు దెబ్బతిన్న రైతులు నష్టపోయారు. తాము అధికారంలోకి వస్తే పంటలు నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం అందేలా పంటల భీమా తీసుకొస్తామని అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ కమిటీ రూపొందించిన అభయహస్తం మేనిఫెస్టో లో హామీ ఇచ్చింది. ప్రభుత్వంపై రైతులు ఆశలు పెట్టుకున్నారు. రాష్ట్రంలో ఫసల్ భీమా యోజన పథకంలో చేరుతుందా..? లేక కొత్తగా పంటల భీమా పథకం తీసుకువస్తుందా అనే ప్రశ్నగా మిగిలింది. ఈ ఖరీఫ్ సీజన్ లో పంటల బీమాపై నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

రాష్ట్రంలో పంటల బీమా ప్రవేశపెట్టాలి. అధిక వర్షాలకు పంట నష్టం జరిగితే, పరిహారం అందే అవకాశం లేకుండా పోయింది. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకానికి గత బీఆర్‌ఎస్ ఇన్సురెన్స్ కంపెనీలకు వాటా చెల్లించలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని అమలు చేయాలి. ఖరీఫ్ సీజన్లో రైతులు పండించిన పంటలకు నష్టం జరిగితే పరిహారం అందించాలి.

# ఉదయం ఎండ.. సాయంత్రం ఉక్కపోత..!



**ప్రజాపక్షం/వైరా:** వాతావరణంలో వస్తున్న మార్పులు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎండ ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. గత కొన్ని రోజులుగా వాతావరణంలో వస్తున్న మార్పులు ప్రజలకు చాలా ఇబ్బందికరంగా మారాయి. ఉదయం 7గంటల నుండే భానుడి ప్రతాపం భగభగమంటూ ఉంది. సాయంత్రం పూట ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇలా వాతావరణ మార్పులు చోటు చేసుకోవడం పట్ల ప్రజల్లో



ఒక రకమైన అలజడి ప్రారంభమవుతుంది. మధ్య మధ్యలో కురుస్తున్న చిరుజల్లులు ఎందుకు ఇలా వాతావరణం మార్పులు జరుగుతున్నాయి. ఉదయం 7గంటలకే రోడ్లపైకి రావడానికి భయపడుతున్నారు. వృద్ధులు అనారోగ్యంతో బాధపడుతున్న వారు ఎప్పుడు ఏమి జరిగిదని వారి కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతూ నీరు తెగ తాగేస్తున్నారు. ఫ్యాన్లు కూడా వేడిగాలి వీస్తున్నాయి. ఎం తాపానికి ఇటు ఉక్కపోతకు తట్టుకోలేక ఒంటిపై కొంతమంది నీరు పోసుకుంటున్నారు. ఇలా ఉక్కిరిబిక్కిరిలతో సతమత ఉష్ణోగ్రతల్లో తేడాలు రావడం పట్ల రోజురోజుకు పెరుగుతున్న ఎండ తీవ్రత ఉక్కపోతలతో ప్రజల్లో ఆందోళన పెరుగుతుంది. ఎప్పుడు ఏమి జరిగిద్దో అని ఆందోళన చెందుతున్నారు.

# శ్లోకాల పోటీలో సరితకు ప్రథమస్థానం

**-శృంగేరీ శారదా పీఠం ద్వారా దక్కిన అరుదైన గౌరవం**
**-భగవద్గీత శ్లోకాల పోటీల్లో**
**ప్రథమ స్థానంలో నిలిచిన సరిత**

**ప్రజాపక్షం/కొణిజర్ల :** సాక్షాత్తు విష్ణుమూర్తి స్వరూపుడైన శ్రీకృష్ణ పరమాత్ముడి లీలలను కళ్లకు కట్టే భగవద్గీతలో స్లోకాలను పఠించడం ఆషామాషీ విషయం కానేకాదు. వాటిని ఆకళింపు చేసుకుని సందర్భానుసారు ఉచ్చరించడం ఇక కత్తిమీద సాములాంటి ప్రక్రియే అవుతుంది. అలాంటి గీతా సారంలోని శ్లోకాలపై నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం పొందడం అంటే సాధారణ విషయమా..? కొణిజర్ల మండలం తనికెళ్ల గ్రామానికి చెందిన కొణపర్తి సరిత ఈ అరుదైన ఘనతను సాధించింది. అంతే కాదు.. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచి నగదు బహుమతిని సైతం కైవసం చేసుకుంది. ఈ నెల 5వ తేదీన కర్ణాటక రాష్ట్రంలోని శృంగేరీ జ్ఞాన పీఠంలో ఈ బహుమతిరి పీఠాధిపతి చిన్నస్వామీజీ విధుశేఖర భారతీ తీర్ధ చేతుల మీదుగా ఆమె అందుకున్నారు. ఈమె గతంలో 2024లో మైసూర్ దత్తపీఠం వారు నిర్వహించిన భగవద్గీత 700 శ్లోకాల పోటీల్లోనూ శ్రీగణపతి సచ్చిదానంద తీర్ధ చేతుల మీదుగా బంగారు పతకాన్ని అందుకోవడం విశేషం. సరిత పాల్వంచకు చెందిన కందుకూరి లక్ష్మీపతి, జయలక్ష్మి దంపతుల మూడో సంతానంగా జన్మించారు. హన్మకొండ అర్బన్ ఎల్కతుర్తి మండలం గోపాలపురం



గ్రామంలో ఆమె పదో తరగతి వరకు చదువుకున్నారు. ఆ తర్వాత కుటుంబ ఆర్థిక పరిస్థితుల రీత్యా ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యాభ్యాసాన్ని ఓపెన్‌లో పూర్తి చేశారు. ఆ తర్వాత సైతం చదువును వదిలేయకుండా పట్టుదల తో బీఈడీ కోర్సు పూర్తి చేశారు. కొంత కాలం ఉద్యోగ వేట సాగించినా ఫలితం లేకపోయింది. దీంతో ఏదో ఒక రంగంలో ప్రావీణ్యం సంపాదించాలన్న తృష్ణతో చిన్ననాటి నుంచి ఆసక్తి కలిగిన శ్లోకాలపై పట్టు సాధించే ప్రయత్నం చేశారు. ఈక్రమంలో ఆమెకు ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న తన భర్త కొణపర్తి శ్రీనివాసరావు ప్రోత్సాహం, కొండంత సహకారం అందాయి. అలా భగవద్గీత, అష్టాదశ పురాణ శ్లోకాల్లో దిట్టగా మారారు. ఈక్రమంలోనే సరితకు దేశవ్యాప్త గుర్తింపు లభించడం విశేషం. తాజాగా శృంగేరీ పీఠంలో జరిగిన జాతీయ స్థాయి శ్లోకాల పోటీల్లో ఆమె ప్రథమ స్థానంలో నిలవడం గొప్ప విషయం.

## పల్లె ప్రజల జీవన ప్రమాణాల
# మార్పుకు నాంది పలికింది ఎర్రజెండానే..




**సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా**



**ప్రజాపక్షం/లక్ష్మీదేవిపల్లి :** దోపిడీ, అణచివేతకు గురవుతూ దుర్భరజీవితం గడుపుతున్న ఏజెన్సీ పల్లె ప్రజల జీవన ప్రమాణాల మార్పుకు నంది పలికి ఆధునికతవైపు నడిపించింది. ఎర్ర జెండానేనని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్ పాషా అన్నారు. రాష్ట్ర వ్యాపిత జరుగుతున్న మహాసభల్లో భాగంగా ఆదివారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని మైలారం, బంగారుచెలక, చింతకుంట, పూనుకుడుచెలక, లక్ష్మీపురం, బొజ్జలగూడెం గ్రామపంచాయతీల పరిధిలోని 31 గ్రామశాఖల సంయుక్త మహాసభ తిప్పగుట్ట గ్రామంలో జరిగింది. మహాసభ సందర్భంగా గ్రామంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. పార్టీ జెండాను ఎగురవేసిన మహాసభను సాబీర్ పాషా ప్రారంభించారు. ఈ సందర్భంగా సాబీర్ పాషా మాట్లాడుతూ, అసమానతలు లేని సమాజ నిర్మాణమే కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని, అన్యాయం, దోపిడీ, అణచివేతలున్నంతకాలం ఎర్రజెండా ఉంటుందని స్పష్టం చేశారు. ఉమ్మడి బంగారుచెలక, మైలారం గ్రామపంచాయతీ పరిధిలో పేదల పక్షాన నిలబడి అనేక భూపోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం వహించి వేలాది ఎకరాలను పేదలకు పంచి బతుకు దారి చూపిందని, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనకు శక్తివంచన లేకుండా కృషిచేసిందని, ఆ పోరాటాల ఫలితంగానే గ్రామీణ జనం కమ్యూనిస్టు పార్టీకి బలమయ్యారన్నారు. ఇక్కడి ప్రజలను చైతన్యవంతం చేసి ప్రశ్నించే, ఎదురించే, పోరాడే తత్వాన్ని నేర్పిందని పేర్కొన్నారు. కమ్యూనిస్టులు లేకుండా చేయాలని కుట్రలు చేసిన వారిని ఇండ్లకే పరిమితం చేసిన పోరాట పటిమ ఈ ప్రాంత గ్రామీణ ప్రజలదని అన్నారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను, కమ్యూనిస్టులను లేకుండా చేయాలని కేంద్రం లోని మోడీ,అమిత్ షా ద్వయం కలలు కంటున్నారని, ఎర్ర జెండాను, కమ్యూనిజాన్ని ప్రజల నుంచి దూరం చేయలేరన్నారు. మావోయిస్టులను, కమ్యూనిస్టులను లేకుండా చేయాలనుకోవడం వారి అవివేకమని, ఆపరేషన్ కగార్ చర్యలకు స్వస్తి చెప్పి ప్రజలకు కావాల్సిందేంటో గుర్తించి వాటిని ప్రజల ధరిచేరేందుకు కేంద్రం పూనుకోవాలని సూచించారు. అనంతరం 31 గ్రామాల నూతన కమిటీలను పార్టీ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి చంద్రగిరి శ్రీనివాసరావు, జిల్లా సమితి సభ్యులు దీటి లక్ష్మీపతి, నాయకులు నూనావత్ గోవిందు, కంటెం సత్యనారాయణ, దారా శ్రీనివాసరావు, జోగా రామయ్య, సపావట్ రవి, బానోత్ నెహ్రూ, జర్పుల ఉపేందర్, పరిపర్తి రాజు, జోగా రాజబాబు, కోడి లింగయ్య, జలీల్ పాషా, శర్వన్, జనార్దన్, లాలూ, లక్ష్మీనారాయణ, వరుస రామస్వామి, ముత్తయ్య, మోహన్, శంకర్, గోపాల్, జానయ్య, బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

# పేదల కల సాకారమవుతుంది..



**ఇందిరమ్మ ఇండ్ల శంకుస్థాపనలో ఎమ్మెల్యే రాగమయి**

**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నిరుపేదలు కన్న కలలు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సాకారమవుతున్నాయన్నారు సత్తుపల్లి శాసనసభ్యురాలు డా.మట్టా రాగమయి దయానంద్. పట్టణంలోని 22 వ వార్డ్ లోని నేతాజీ రోడ్ లో ఆదివారం జరిగిన ఇందిరమ్మ ఇంటి శంకుస్థాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి పాల్గొని ,భూమి పూజ చేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలకు సొంతిల్లు ఒక కలని, పేదలకు కావాల్సింది కూడు, గూడని, ఇవి రెండు ఉన్న వారు హాయిగా జీవిస్తారన్నారు. సన్నబియ్యం పంపిణీతో పేదల కడుపులు నింపుతున్న ముఖ్యమంత్రి, ఇందిరమ్మ ఇళ్ళను అందించి వారి స్వప్నాలను సాకారం చేస్తూ పేదల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతున్నారని కొనియాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ అమలు చేస్తున్న సంక్షేమ,అభివృద్ధి పథకాలు ఈ దేశానికే ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రివర్యులు భట్టి, పొంగులేటి,తుమ్మలలకు ప్రజల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్, సత్తుపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ దోమ ఆనంద్, సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, సీనియర్ నాయకులు చల్లగుళ్ల నరసింహ రావు, కమల్ పాషా,షరిఫ్, ఏ.రామారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇల్లు అద్దెకు ఇస్తున్నారా.. అయితే తస్మాత్ జాగ్రత్త..!



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఇల్లు అద్దెకు ఇచ్చే సమయంలో ఇంట్లో అద్దెకు వచ్చే వారి పూర్తి వివరాలు తెలుసుకొని అద్దెకి ఇవ్వాలని అద్దెకిచ్చే ముందు తస్మాత్ జాగ్రత్త అని బూర్గంపాడు ఎస్ఐ ఈ రాజేష్ అన్నారు. మండల పరిధిలోని సారపాక గ్రామంలో ప్రముఖ పరిశ్రమ పేపర్ కర్మాగారం ఉండటంతో కర్మాగారంలో పని చేసే కార్మికులు సుమారు నాలుగు రాష్ట్రాల వారు ఈ ప్రాంతంలో నివాసం ఉంటూ పనులకు వెళుతూ ఉంటారని, అదే విధంగా బిల్డింగ్ నిర్మాణం కోసం తాపీ పని చేయడానికి ఇతర రాష్ట్రాల నుండి వలస వచ్చి అద్దెలకు ఉంటారని ఈ క్రమంలో ఇంటి యాజమానులు అద్దెలకి ఇచ్చే ముందు ఎక్కువ రెంట్ మాత్రమే ఆలోచించి అద్దెలకి ఇవ్వడం పరిపాటిగా మారిదందని, దీంతో వారు ఏ పని మీద వస్తున్నారు ఏ పని చేస్తున్నారు వాళ్ల వివరాలు కూడా పూర్తి స్థాయిలో లేకపోవడం పలు క్రైమ్‌లకు దారి తీస్తున్నట్లు తెలిపారు. ఇంటి యాజమానులకు అద్దెలకి ఇచ్చే సమయంలో తప్పని సరిగా పలు విషయాలను గుర్తు ఉంచుకోవాలన్నారు. వారి ఆధార్ కార్డు, వారు ఏ ప్రాంతం వారు ఫ్యామిలీతో వస్తున్నారా లేదా బ్యాచిలర్‌గా ఉన్నారా ఏ కంపెనీలో పని చేస్తున్నారు. లేదా ఏ పని కోసం వచ్చి ఇల్లు అద్దెకు అడుగుతున్నారు వారి పూర్తి వివరాలను సేకరించి అద్దెకివ్వాలని సూచించారు. కాసులకు కక్కుర్తి పడి ఇంటి యాజమానులు బ్యాచిటర్లకు అద్దెలకి ఇవ్వడంతో కొంత మంది బ్యాచిలర్లు కొన్ని అక్రమ రవాణా విషయంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా ఇంటి యాజమానులకు తలనొంపులు కానున్నట్లు తెలిపారు. సారపాక, లక్ష్మి పురం గ్రామాలలో పలు పరిశ్రమలు ఉండటంతో ఆ ప్రాంతంలో ఉంటున్న ఇంటి యజమానులు తమ ఇల్లు అద్దెకిచ్చే ముందు పూర్తి స్థాయి వివరాలను సేకరించి ఇవ్వాలని సూచించారు. ఎవరైనా అనుమానితంగా కనపడితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. గుర్తు తెలియని వారికి ఇల్లు అద్దెకిచ్చి తర్వాత ఇబ్బందులు పడే కంటే ముందుగానే వివరాలను సేకరించాలని తెలిపారు.

## ప్రతిభావంతులైన విద్యార్థులకు సత్కారం



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు కమ్మ మహాజన సేవా సంఘం ఆధ్వర్యంలో మణుగూరు మండలంలోని కమ్మ సామాజిక వర్గంలోని ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు చిరుసత్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సి ఐ నాగబాబు పాల్గొన్నారు. 2024 25 విద్యాసంవత్సరంలో పదవ తరగతి, ఇంటర్ విధ్యార్థులలో ఉత్తమ ఫలితాలు సాధించిన అంచుమల్ల సిరి, తమ్మినేని సాత్విక, దొడ్డపనేని వర్షిని, మందలపు దీక్షిత, గోగినేని సాయి సన్ హిత్, ధమ్మాల పాటి జ్వలితాచౌదరి లను స్థానిక సిఐ పాటి నాగబాబు, పురప్రముఖులు విద్యార్థులను సత్కరించారు. మణుగూరుకు చెందిన ఉడతానేని రామారావు మాట్లాడుతూ ఈ ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆరు సంవత్సరాలు పాటు ప్రతి ఒక్కరికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తానని ప్రకటించారు. అలానే మరికొందరు పేదవిద్యార్థులకు అర్థికంగా ఆదుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కమ్మ సామాజిక వర్గంలో పేద విద్యార్థులకు చేయుతగా నిలుస్తామన్నారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రత్యేక గుర్తింపు వొచ్చేలా ఆలోచన చేసి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. కార్యక్రమములో మణుగూరు కమ్మ మహాజన సేవ సంఘం కమిటీ సభ్యులు, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## ఆశీస్సులు, పరామర్శలు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని రుద్రాక్షపల్లి గ్రామంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు డా.మట్టా దయానంద్ విజయ్ కుమార్ ఆదివారం పర్యటించి పలు శుభాకార్యలకు హాజరై చిన్నారులను ఆశీర్వదించి, పలువురిని పరామర్శించారు. గ్రామంలో గంపా మధు, సీతా కుమారుల నూతన వస్త్ర అలంకరణ వేడుకలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. సీనియర్ నాయకులు పిన్నమనేని దామోదర్ రావు ఇటీవల అనారోగ్యానికి గురికాగా వారిని కలుసుకుని ఆరోగ్య వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా రేషన్ డీలర్ శ్రీనివాస్ రెడ్డి కాలుకు ఇటీవల సర్జరీ జరగ్గా వారిని కలుసుకుని పరామర్శించి, ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సత్తుపల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గాదె చెన్నారావు, రుద్రాక్షపల్లి కాంగ్రెస్ నాయకులు భరత్ కుమార్, భూపతి రెడ్డి, హలవత్ అర్జున, ధారవత్ కృష్ణ, కుంట కృష్ణ, కొర్స వసంత రావు, జారే బాపురావు, ప్రతాప్, కుసిని మధు, అంగోతు వెంకటేశ్వరరావు, రాజకుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మాగంటి మృతి బీఆర్‌ఎస్‌కి తీరని లోటు



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** అనారోగ్యంతో చికిత్స పొందుతూ అకాల మృతి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పార్థివ దేహాన్ని బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు, సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య మాదాపూర్ లోని ఆయన నివాసంలో సందర్శించి, పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించి, వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఎమ్మెల్యే గోపినాద్ మృతి పార్టీకి తీరని లోటన్నారు. అనంతరం శోకతప్తులైన గోపీనాథ్ కుటుంబ సభ్యులను ఓదార్చారు.

# తలసేమియా చిన్నారుల కోసం బాలాజీ ఎస్టేట్స్




**-భవిష్యత్తులో మరిన్ని సేవలు**
**-బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి**
**-చిన్నారుల్లో మానసిక స్థైర్యం పెరగాలి**
**-ప్రముఖ వైద్యులు గిరిసింహారావు**

**ప్రజాపక్షం/ఖమ్మం :** తలసేమియా చిన్నారులకు బాలాజీ ఎస్టేట్స్ అండగా నిలుస్తుందని ఒక ధృడ సంకల్పంతో వారికి సేవలు అందించేందుకు ప్రయత్నిస్తున్నామని బాలాజీ ఎస్టేట్స్ అధినేత వత్సవాయి రవి తెలిపారు. సంకల్ప స్వచ్ఛంద సేవా సంస్థకు తోడుగా పని చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ఆదివారం సంకల్ప సేవా సంస్థ ఆధ్వర్యంలో తలసేమియా వ్యాధిగ్రస్తులకు మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వత్సవాయి రవి మాట్లాడుతూ నెలకు మూడుసార్లు రక్తం ఎక్కించుకోవడం చాలా ఇబ్బందికర పరిస్థితి అని ఇది చూస్తుంటే చిన్నారులు ఎంతగా ఇబ్బందులు పడుతున్నారో అవగతమవుతుందన్నారు. తలసేమియా బాధితుల కోసం మూడు నెలలకు ఒకసారి రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేస్తామని ఆయన తెలిపారు. 50 మంది తలసేమియా చిన్నారులను విమానం ఎక్కించి వారి సంతోషంలో పాలు పంచుకుంటామని రవి తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆర్టిసి జోనల్ వైద్యాధికారి గిరి సింహారావు మాట్లాడుతూ తలసేమియా చిన్నారులు, తల్లిదండ్రులు ఆత్మస్థైర్యంతో ధైర్యంగా ఉండాలన్నారు. వ్యాధిని తలచుకుని బాధపడటం వల్ల త్వరగా అనారోగ్యాల పాలై జీవితాలను కోల్పోతారన్నారు. చిన్నారులు సాధారణ జీవితం గడిపేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని, క్రమం తప్పకుండా రక్తం ఎక్కించుకుని మందులు వాడాలన్నారు. ఈ. కార్యక్రమంలో సంస్థ ఫౌండర్ పి. అనిత, సంస్థ బాధ్యులు పి. పావని, రవిచందర్, ఉదయ్‌భాస్కర్, వంశీ, ఉపేందర్, మధు, నాగేందర్, వెంకట్ పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు ప్రమాణ స్వీకారం

**-తరలివెళ్లిన వైరా ఆర్యవైశ్యులు**
**-వనమా కిరణ్, నూకల వాసుకు సన్మానం**





**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులుగా పసుమర్తి చందర్‌రావు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి వైరా ఆర్యవైశ్యులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. వైరా వర్తక సంఘం అధ్యక్షులు ఆర్యవైశ్య రాష్ట్ర నాయకులు వనమా విశ్వేశ్వరరావు ఆదేశాలు సూచనలు మేరకు వైరా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున తరలి ఆర్యవైశ్య సంఘం నాయకులు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. కల్లూరులో డిఎన్‌పి కళ్యాణ మండపం నందు జరిగింది. ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య మహాసభ నాయకులు పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ ప్రధాన కార్యదర్శి వనమా కిరణ్‌కుమార్, జిల్లా మొదట ఉపాధ్యక్షులు నూకల శ్రీనివాసరావుని వైరా మండల, పట్టణ ఆర్యవైశ్య మహాసభ తరపున సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు వనమా విశ్వేశ్వరరావు, మండల సంఘం అధ్యక్షులు మిట్టపల్లి కిరణ్‌కుమార్, పట్టణ సంఘం అధ్యక్షులు దారా వెంకటకృష్ణ, నూకల ప్రసాదరావు,వ జినేపల్లి చక్రధరరావు, మిట్టపల్లి సత్యంబాబు, రవి, శ్రీధర్, రాయల నాగేశ్వరరావు, గంగాధర్, కృష్ణమూర్తి, వెంకటరమణ, జగన్‌మోహన్‌రావు, నారాయణ, రాంబాబు, అవినాష్, వెంకటరమణ, మురళీకృష్ణ, గ్రంధి విశ్వం, శ్రీనివాసరావు, శివశంకర్, నాగపవన్, సుజిత్, సైదారావు, కార్తీక్, ఉదయ్‌తేజ, అన్నపూర్ణ, మహాలక్ష్మి, మౌనిక, సునీత, మాణిక్యమ్మ, వాసవి, సునీత, రోజా తదితరులుపాల్గొన్నారు.

# బాలుర ఆశ్రమ పాఠశాలలో ఫోక్సో నిందితుడి నియామకంపై వివాదం

**ప్రజాపక్షం/కారేపల్లి:** రేలకాయలపల్లి బాలుర ఆశ్రమ పాఠశాలలో ఫోక్స్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని ప్రధానోపాధ్యాయుడిగా నియమించిన ఘటన తీవ్ర వివాదానికి దారి తీసింది. ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఈ నిర్ణయంపై స్థానిక ప్రజా సంఘాలు, విద్యా సంఘాలు, గిరిజన సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థుల భద్రతను ప్రశ్నార్థకం చేస్తూ, ఈ నియామకం వెనుక ఉన్న ఉద్దేశాలపై సమాజం న్యాయం కోరుతోంది.

**నిందితుడి నియామకం ఎలా సాధ్యం....**
ఫోక్స్ కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని బాలలతో నిత్యం సన్నిహితంగా ఉండే ప్రధానోపాధ్యాయ పదవిలో నియమించడం ట్రైబల్ వెల్ఫేర్ శాఖ డిప్యూటీ డైరెక్టర్ నిర్ణయంగా తెలుస్తోంది. ఈ నిర్ణయం చట్టపరమైన వ్యవస్థపై నమ్మకాన్ని సడలించడమే కాక, అధికార నిర్లక్ష్యం లేదా ఇతర దురుద్దేశాల సంకేతాలను ఇస్తోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. గిరిజన, పేద రైతు కుటుంబాలకు చెందిన విద్యార్థులు చదువుకునే ఈ పాఠశాలలో ఇటువంటి నియామకం నైతిక, చట్టపరమైన నిబంధనలను ఉల్లంఘించినట్లు భావిస్తున్నారు.

**ప్రజల ఆందోళన, ప్రశ్నలు....**
ఈ ఘటనపై స్థానికులు, విద్యా సంఘాలు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఫోక్స్ కేసు నమోదైన వ్యక్తిని ఎలా ఛార్జ్‌లోకి తీసుకొచ్చారు..మరో సారి దుర్ఘటన జరిగితే బాధ్యత ఎవరు కాపాడతారు..అని సమాజం ప్రశ్నిస్తోంది. ఈ పాఠశాల గిరిజన విద్యార్థుల కలలకు



పునాదిగా ఉండగా, ఇటువంటి నిర్ణయం వారి భవిష్యత్తుపై ఆందోళన కలిగిస్తోంది.

**ప్రజా సంఘాల డిమాండ్....**
ప్రాంతీయ విద్యా సంఘాలు, గిరిజన సంఘాలు, ప్రజా సంఘాలు కలిసి, నిందితుడిని తక్షణమే విధుల నుంచి తొలగించాలని, పాఠశాలపై ప్రత్యేక దృష్టి పెట్టి విద్యార్థుల భద్రత కోసం తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అదే విధంగా ఈ నియామకం వెనుక ఉన్న కారణాలను విచారణ ద్వారా వెలుగులోకి తేవాలని కోరుతున్నాయి.

**న్యాయం కోసం పోరాటం...**
ఈ ఘటన విద్యార్థుల భద్రత, చట్ట వ్యవస్థపై నమ్మకం, నైతిక విలువలను ప్రశ్నిస్తోంది. ప్రజాపక్షం ప్రజల వైపు నిలిచి, న్యాయం కోసం పోరాడుతుంది. ఈ విషయంలో అధికారుల నుండి స్పష్టమైన సమాధానం, తగిన చర్యలు తీసుకోవాలని సమాజం ఆకాంక్షిస్తోంది.

# కాంగ్రెస్ హయాంలోనే సొంతింటి కల నెరవేరుతుంది..



**ప్రజాపక్షం/కరకగూడెం:** ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. ఆదివారం కరకగూడెం మండలం కరకగూడెం గ్రామపంచాయతీ లోని మోతె గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు లబ్ధిదారుడు ముదురుకోళ్ల వెంకన్న నూతనంగా నిర్మించే ఇందిరమ్మ ఇంటి భూమి పూజ శంకుస్థాపన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చింది కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ప్రతి పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారంగా ఈ ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు, యువకులు, అభిమానులు పాల్గొన్నారు.

# సిపిఐ మండల మహాసభలు

**-11న బోనకల్ , 12న కామేపల్లి**



**ప్రజాపక్షం/ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) బోనకల్ మండల మహాసభ ఈనెల 11న ముష్టికుంట్ల గ్రామంలో జరుగుతుందని సిపిఐ మండల కార్యదర్శి వెంగళ ఆనందరావు తెలిపారు. దివంగత సిపిఐ నేత జక్కా నాగభూషణం ప్రాంగణంలో ఈ మహాసభ జరుగుతుందని సిపిఐ గ్రామశాఖకు ప్రాతినిథ్యం వహిస్తూ 200 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ఈనెల 12న కామేపల్లి మండల సిపిఐ మహాసభ తాళ్లగూడెంలో జరుగుతుందని సిపిఐ మండల కార్యదర్శి పుచ్చకాయల వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ గ్రామ శాఖకు ప్రాతినిథ్యం వహిస్తూ 200 మంది ప్రతినిధులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. చింతకాని మండల మహాసభ ఈనెల 16న మండల పరిధిలోని లచ్చగూడెం గ్రామంలో జరుగుతుందని మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జున్ తెలిపారు. ఈ మహాసభలకు ముఖ్య అతిథులుగా సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు తోట రామాంజనేయులు, ఏపూరి రవీంద్రబాబు తదితరులు హాజరుకానున్నట్లు ఆయా మండల కార్యదర్శులు తెలిపారు.

# 14న లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



**ప్రజాపక్షం/వైరా:** వైరా పోలీస్‌స్టేషన్ పరిధిలోని ప్రజలకు విజ్ఞప్తి జూన్14వ తారీఖున మధిర కోర్టులో నేషనల్ లోక్ అదాలత్ ఉంది. వైరా మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఉన్న వారిలో వారి బంధువుల్లో ఏమైనా కేసులు ఉన్నట్లయితే వాటిని కాంప్రమైజ్ రాజీ చేసుకునేందుకు జూన్ 9 నుండి జూన్ 14వరకు కేసుకు సంబంధించి ఇరు వర్గాలు కోర్టుకు హాజరై రాజీ చేసుకుంటే ఆ ఏసును పూర్తిగా క్లోజ్ చేయబడును అని వైరా ఎస్సై పి.రామారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాక్సిడెంట్ కేసులు కొట్టుకున్న కేసులు, చీటింగ్ కేసులు, చిట్‌ఫండ్ కేసులు, భూతగాదాలకు సంబంధించిన కేసులు వివాహ బంధానికి సంబంధించిన కేసులు చిన్న చిన్న దొంగతనం మొదలైన కేసులకు సంబంధించిన వారు లోక్‌అదాలత్‌లతో రాజీపడి కేతులు కొట్టివేపించుకోవచ్చును. ఇది మండల ప్రజలు సద్వినియోగం చేసుకోగలరని ఎస్సై రామారావు తెలిపారు. రాజీ కోసం ఫిర్యాదుదారుడు, నేరస్థులు ఇద్దరు వారికి సంబంధించిన ఆధార్‌కార్డు తీసుకొని మధిర కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవాల్సిందిగా కోరుచున్నామని ఆయన అన్నారు. వివరాలకు సంబంధించి వైరా ఎస్సై 8712659148, కోర్టు కానిస్టేబుల్ డి.నర్సింహారావు 9703139988 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

# మాగంటి గోపినాధ్ మృతి పట్ల దిగ్భ్రాంతి

**ప్రజాపక్షం/వైరా:** జూబ్లిహిల్స్ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపినాధ్ అకాల మరణం పట్ల వైరా బిఆర్ఎస్ నాయకులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసి సంతాపం తెలిపారు. సంతాపం తెలిపిన వారిలో మాజీ ఎంపిపి బిఆర్ఎస్ జిల్లా నాయులు, కట్టా కృష్ణార్జున్‌రావు, బిఆర్ఎస్ జిల్లా నాయకులు, వనమా విశ్వేశ్వరరావు, మాజీ మున్సిపాల్ వైస చైర్మన్ ముళ్ళపా టి సీతారాములు, బిఆర్ఎస్ మండల, పట్టణ అధ్యక్షులు బాణాల వెంకటేశ్వర్లు,మ ద్దెల రవి, డాక్టర్ కాపా మురళీకృష్ణ, మాదినేని దుర్గాప్రసాద్, బిఆర్ఎస్ మాజీ కౌన్సిలరర్లు మాదినేని సునీత, దారెల్లి పవిత్రకుమారి, ఏదునూరి పద్మజ, లగడపాటి లక్ష్మీ రాజ్యం, కామినేని శ్రీనివాసరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, లగడపాటి ప్రభాకర్‌రావు, నూకల ప్రసాద్, నూకల వాఉ, పెరుమాళ్ళ కృష్ణమూర్తి, మిట్టపల్లి సత్యంబాబు, గుజ్జర్లపూడి దేవరాజ్, వజినేపల్లి చక్రవర్తి, విలాసాగరం నరేష్, ఓంకార్, ఆదూరి ప్రమ్, వీరబాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# మదన్‌లాల్ సంస్మరణ సభకు తరలివెళ్లిన బిఆర్ఎస్ నాయకులు



**ప్రజాపక్షం/వైరా:** వైరా మాజీ శాసనసభ్యులు బానోతు మదన్‌లాల్ దశదిన కార్యక్రమం, సంస్మరణ సభ ఆదివారం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి గ్రామంలో జరిగింది. ఈ సంస్మరణ సభకు వైరా మండల బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లి మదన్‌లాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మదన్‌లాల్ చేసిన అభివృద్ధిని ప్రతిఒక్కరూ అక్కడ గుర్తు చేశారు. అనంతరం మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్‌ను పరామర్శించారు.

# విద్యుదాఘాతంతో వెల్డర్ మృతి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** విద్యుత్ షాక్‌తో వెల్డర్ మృతిచెందిన సంఘటన మండల పరిదిలోని తనికెళ్లలో శనివారం చోటుచేసుకుంది. కొణిజర్ల ఎస్సై సూరజ్ తెలిపిన వివరాలు ప్రకారం తనికెళ్ల రాష్ట్రీయ ప్రధానరహదారి ప్రక్కన షేక్ జిలానీ వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్నాడు. ఆ షాపులో కొణిజర్ల మండల కేంద్రానికి చెందిన బండారు శివకృష్ణ (23) వెల్డర్ గా పనిచేస్తున్నాడు. వెల్డింగ్ చేస్తున్న క్రమంలో విద్యుత్ షాక్ తగలగడంతో శివకృష్ణను ఖమ్మంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. వెల్డింగ్ షాపులో జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే విద్యుత్ షాక్ కారణంగా మరణించాడని తల్లి బండారు ముత్తమ్మ ఆరోపించింది. తల్లి ముత్తమ్మ ఫిర్యాదు మేరకు కొణిజర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.